# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506



## రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యుమో పంపండి.

95150 34555

84979 20544



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | శనివారం, 12 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 30 | పేజీలు: 4 | వెల:10/-


## ఎంపీ ఈటలకు కొప్పుల ధన్యవాదాలు

పాతపోచంపల్లి రోడ్డుపై దృష్టి పెట్టడం సంతోషం




వివరాలు 3 లో

కంచ భూములు 03


## హెచ్‌సీయూకు బదిలీ కాలేదు

ఎంపవర్డ్ కమిటీని కలిసిన భువనగిరి, ఖమ్మం ఎంపీలు



## టెట్ నోటిఫికేషన్ విడుదల

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 15 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 15 నుంచి 30 మధ్యలో అధికారులు పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 9న హాల్‌టికెట్లు.. జూలై 22 ఫలితాలు విడుదల చేస్తామని విద్యాశాఖ తెలిపింది. అయితే ఈ నోటిఫికేషన్ పూర్తి వివరాలు ఈ నెల 15 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి.



# కార్పొరేటు.. చదువుకు చేటు

వ్యాపారంగా మారిన కార్పొరేట్ విద్య

- వేసవి సెలవులకు ముందే అడ్మిషన్ల జోరు
- ఆఫర్లు అంటూ తల్లిదండ్రులకు వల
- ఆలస్యం చేస్తే నష్టపోతారని భయపెట్టి అడ్మిషన్లు చేయిస్తున్న ఏజెంట్లు
- ఒక్కో ఏజెంట్‌కు అడ్మిషన్‌కు రూ. 5 వేల వరకు చెల్లిస్తున్న యాజమాన్యాలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు
- ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్న కార్పొరేట్ సంస్థలు

'ఏదైనా ఒక దేశాన్ని నాశనం చేయాలంటే ఆ దేశంపై యుద్ధం చేయనక్కర్లేదు.. అక్కడి ప్రజలకు విద్య అందకుండా చేస్తే చాలు.. ఆ దేశం దానంతటఅదే నాశనం అయిపోతోంది' అని నిపుణులు చెబుతుంటారు. విద్యకు అంతటి శక్తి ఉంది. మానవ జాతి జీవితాన్ని నిలబెట్టడానికి శక్తినిచ్చే అంశంగా విద్యను పరిగణిస్తారు. విద్య దినదినాభివృద్ధి చెందుతోంది. సంప్రదాయ గురుకులాల నుంచి నేటి ఆధునిక స్కూళ్ల వరకు ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఇప్పుడీ విద్య వ్యాపారమైంది. డబ్బును కొలిచే సాధనంగా మారింది.

- నేటి ప్రస్థానం, హైదరాబాద్:

2వ పేజీలో..

# నెక్లెస్ రోడ్డులో పూలే విగ్రహం



### స్థల పరిశీలన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

### ధన్యవాదాలు తెలిపిన జాజుల శ్రీనివాస్‌గౌడ్

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** హైదరాబాదులోని నెక్లెస్‌రోడ్‌లో సామాజిక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పూలే విగ్రహ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా స్థల పరిశీలన చేసి, పూలే జయంతి రోజున చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు బీసీ సమాజం తరపున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రాజధానిలో తొలిసారి ప్రభుత్వం అధికారికంగా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం పెట్టకుండా బీసీలను అవమానించారని విమర్శించారు. హైదరాబాదులో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని బీసీలు ఎన్నిసార్లు కోరిన నాటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. పూలేకు నివాళులు కూడా అర్పించలేదని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ముగియగానే పూలే విగ్రహ నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో రోడ్డు వెడల్పులో గాని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సచివాలయం,

మిగతా 2 లో



## ఫోన్ పే ద్వారా లంచం!

- భద్రాచలం పోలీసుల ఘనత
- దాడి చేసి పట్టుకున్న ఏసీబీ
- సీఐ, కానిస్టేబుల్‌తో పాటు మరొకరిపై కేసు

మోరం తరలిస్తున్న లారీని విడిచిపెట్టేందుకు లంచం డిమాండ్ చేసిన సీఐ, గన్‌మెన్, ఓ ప్రైవేటు వ్యక్తిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాచలం పట్టణంలో శుక్రవారం జరిగింది.

03

# కార్పొరేటు.. చదువుకు చేటు





**మా** పిల్లలను కార్పొరేట్ బడుల్లో, కళాశాలల్లో చదివించాలనే తల్లిదండ్రుల బల హీనతను ప్రైవేటు విద్యా సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి కమీషన్ ఏజెంట్లను నియమించుకుని ముందస్తు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభానికి ఆరు మాసాల ముందు నుంచే ఈ దందా మొదలవుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి ముందస్తు అడ్మిషన్ల కోసం వారికి మైండ్ వాష్ చేసి ఒప్పిస్తున్నారు. ఇప్పుడు అడ్మిషన్లు తీసుకుంటే ఫీజుల్లో రాయితీలు ఇస్తామని, ఆలస్యంగా వస్తే అడ్మిషన్లు దొరకవని భయపెడుతున్నారు. ముందస్తు అడ్మిషన్లు విరుద్ధమని తెలిసినా కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు ఏటా అదే పద్ధతిని కొనసాగిస్తున్నాయి.

- వ్యాపారంగా మారిన కార్పొరేట్ విద్య
- సెలవులకు ముందే అడ్మిషన్ల జోరు
- ఆఫర్లు అంటూ తల్లిదండ్రులకు వల
- ఆలస్యం చేస్తే నష్టపోతారని భయపెట్టి అడ్మిషన్లు చేయిస్తున్న ఏజెంట్లు
- ఒక్కో ఏజెంట్‌కు అడ్మిషన్‌కు రూ. 5 వేల వరకు చెల్లిస్తున్న యాజమాన్యాలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు
- ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్న కార్పొరేట్ సంస్థలు

## విద్యతో పాటు చాలా కొనాలి

విద్య వ్యాపారంగా మారిందని ఏళ్ల తరబడి విద్యావేత్తలు మొత్తుకుంటున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. ప్రైవేటు బడుల్లో పిల్లలను చదివించే తల్లిదండ్రులు విద్యతోపాటు చాలానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తొలుత పుస్తకాలు కొనాలి. ఆ తర్వాత యూనిఫాం కొనాలి. దాంతో పాటు టై, బెల్ట్, షూ, సాక్స్.. ఇలా అన్నింటినీ స్కూల్‌లోనే కొనాలి. తక్కువకు దొరుకుతాయి కదా అని బయట కొనుగోలు చేస్తే అవి చెల్లవు. ప్రభుత్వాలు నిర్బంధ విద్యను అమలు చేయాలని చూస్తుంటే ప్రైవేటు స్కూళ్లు పిల్లల తల్లిదండ్రులతో నిర్బంధ కొనుగోళ్లు చేయిస్తూ డబ్బు మూటలు పోగేసుకుంటున్నాయి.



## ప్రభుత్వాలు ఏం చేయాలి?

విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలవైపు చూడకుండా ఉండాలంటే ప్రభుత్వ సంస్థల నాణ్యతను పెంచాలి. విద్యార్థులు ప్రైవేట్ వ్యాపార ఆధారిత సంస్థల వైపు మళ్లడానికి ప్రధాన కారణాలలో ఒకటి ప్రస్తుత ప్రభుత్వం లేదా ఎయిడెడ్ సంస్థల నాణ్యత దిగజారడం. ప్రత్యామ్నాయాలు లేకపోవడం వల్ల విద్య ప్రైవేటీకరణ పెరుగుతోంది. ప్రభుత్వం విద్యా ప్రమాణాలను పెంచాలి. సరైన మౌలిక సదు-పాయాలను అభివృద్ధి చేయాలి.

## రంగంలోకి ఏజెంట్లు

వేసవి సెలవులకు ముందే ప్రైవేటు విద్యా సంస్థల ఏజెంట్లు రంగంలోకి దిగుతారు. విద్యా సంవత్సరం ముగియకముందే విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు సేకరించి నిత్యం ఫోన్ చేసి విసిగిస్తుంటారు. అడ్మిషన్లు అయి-పోతున్నాయంటూ ఆఫర్లు ప్రకటించి బుట్టలో వేసుకుంటారు. ఆఫర్లంటే పడిచచ్చిపోయే జనం కార్పొరేట్ విద్యాసంస్థలు ఇచ్చే ఆఫర్లకు లొంగిపోయి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ చేసే ఒక్కో ఏజెంట్‌కు ఆయా సంస్థను బట్టి ఒక్కో అడ్మిషన్‌కు రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు చెల్లిస్తున్నారు. అంతేకాదు, స్కూళ్లలో, కాలేజీల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకులకు టార్గెట్లు పెట్టి మరీ అడ్మిషన్ల కోసం తిప్పుతుండటం గమనార్హం. వీరికి వేతనంతోపాటు కమీషన్ కూడా ముడుతుంది. ఇది ఒక్క హైదరాబాద్ వంటి నగరాలకే కాదు.. చిన్నచిన్న పట్టణాల్లో సైతం ఇదే కొనసాగుతోంది.

**కార్పొరేట్ కళాశాలలో చేర్పించే ముందు విద్యార్థుల అభిప్రాయాలతోపాటు కళాశాలలో విద్య నాణ్యత, బోధన చేస్తున్న వారి అనుభవం, ఆ కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి. హాస్టల్‌లో ఉంచినట్లయితే వసతులపై ఆరా తీసిన తర్వాతనే అడ్మిషన్ తీసుకోవాలి. తమ విద్యా వ్యాపారం కోసం మసి పూసి మారేడు కాయ చేస్తున్న కళాశాలలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కళాశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే విద్యార్థి తీవ్ర ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుంది.**

## 4 నెలల నుంచే ఫోన్లు

ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నాలుగు మాసాల ముందు నుంచే ఏజెంట్లు ఫోన్లు చేస్తూ విసిగిస్తుంటారు. ఫలితాలు రాకముందే ఎలా చేర్పించాలని ప్రశ్నిస్తే.. మీ పిల్లలు బాగానే చదువుతారని తమకు సమాచారం ఉందని, తమ కళాశాలలో చేర్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఊదరగొడుతుంటారు. బలవంతంగా వారిని కాలేజీకి రప్పిస్తారు. అక్కడికి వెళ్లాక తల్లిదండ్రుల మైండ్‌ను వాష్ చేసి అడ్మిషన్ తీసుకునేలా చేస్తారు. పదో తరగతి ఫలితాలతో సంబంధం లేకుండా తాము చేర్చించుకుంటామని, ఒకవేళ పాస్ కాకపోతే చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వు చేసుకోకపోతే ఆ తర్వాత కోరిన బ్రాంచ్ దొరకదని ఆందోళనకు గురి చేస్తారు. వారి బాధ భరించలేక ఏ కళాశాల అయితే ఏమవుతుందిలే అని అడ్మిషన్లు తీసుకుంటే చేతులారా తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేసిన వాళ్లు అవుతారు.. ఒకసారి కాలేజీల్లో చేరితే తర్వాత ఎవరూ పట్టించుకోరు.






## ఫీజులు కట్టకుంటే నిర్బంధం

కాలేజీలోనో, స్కూల్‌లోనే చేర్పించే ముందు కాళ్లావేళ్లా పడే కార్పొరేట్ సంస్థలు ఆ తర్వాత మాత్రం తమ ప్రతాపాన్ని చూపుతుంటాయి. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను నడిరోడ్డుపై నిలబెట్టడం, నిర్బంధించడం వంటివి చేస్తుంటాయి. ఇటీవల కీసర సమీపంలోని ఓ ప్రైవేటు స్కూలు యాజమాన్యం నాలుగో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులను లైబ్రరీలో బంధించింది. రూ. 1.3 లక్షల ఫీజుకు ఇంకా రూ. 30 వేలు పెండింగ్‌లో ఉండటంతో ఈ దారుణానికి పాల్పడింది. చివరికి పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఈ ఘటన ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట వెలుగు చూస్తూనే ఉన్నాయి.

## ప్రతిభ ఆధారిత విద్యను ప్రోత్సహించాలి

ఓ అధ్యయనం ప్రకారం.. ఎక్కువ మంది విద్యార్థులు తమ ఇష్టానికి విరుద్ధంగా ఇంజనీరింగ్, వైద్య కోర్సుల్లో చేరుతున్నారు. ఎవరో ఏదో అనుకుంటారనో, గొప్పలకు పోయే ఎక్కువమంది తల్లిదండ్రులు ఇలా పిల్లలకు ఇష్టం లేకుండా తమ ఇష్టాలను వారిపై రుద్దుతున్నారు. ఫలితంగా విద్యార్థులపై ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ వాస్తవాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. పిల్లలకు ఇష్టమైన, వారి ప్రతిభకు సంబంధించిన కోర్సులు కొనసాగించేలా చూడాలి.

# అమెరికా పర్యటనలో మంత్రి కోమటి రెడ్డి



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కాలిఫోర్నియాలోని శాంటాఅనాలోని కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను.. వారు అవలంబిస్తున్న తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో రహదారి భద్రత, ట్రాఫిక్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కాలిఫోర్నియాలో అవలంబిస్తున్న టెక్నాలజీ తీరును వారు పరిశీలిస్తారని ట్విట్టర్ వేదికగా తెలిపారు.

# నెక్లెస్ రోడ్డులో పూలే విగ్రహం

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ, నెక్లెస్ రోడ్ మధ్యలో పూలే విగ్రహం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. బీసీ సంఘాలు కోరిన విధంగా రెండు ఎకరాల పార్క్‌లో మహాత్మా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. బీసీ సమాజం తరఫున సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ సందర్భంగా జాజుల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ఎంపీ ఈటలకు కొప్పుల ధన్యవాదాలు

**పాతపోచంపల్లి రోడ్డుపై దృష్టి పెట్టడం సంతోషం**



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** మన్సూరాబాద్ నుంచి పాత పోచంపల్లి రోడ్డును అభివృద్ధి చేయాలని డిల్లీలో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్రమంత్రికి విన్నవించారని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూపాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించడానికి డీపీఆర్ ఇవ్వాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని, కేంద్ర ప్రభుత్వానికి కనీసం లేఖ కూడా రాయలేదని గుర్తు చేశారు. సీఆర్ఐడీఏ, అటవీశాఖ సంబంధించిన ప్రహరీలను తీసేసి, రోడ్డు అభివృద్ధికి కావాల్సిన స్థలాన్ని కేటాయించే విధంగా అధికారులను సమన్వయం చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు చర్యలు చేపడుతామన్నారు. గౌరెల్లి ఔటర్ రింగ్ రోడ్‌కు కనెక్ట్ అయ్యేలా రోడ్డు అభివృద్ధి పనులు చేపడితే మన్సూరాబాద్ పరిసర ప్రాంత 60 కాలనీలకు దూరం తగ్గి. ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు ఎంపీ ఈటల ప్రత్యేక చొరవ తీసుకోవడం.. ఇందులో భాగంగా ఢిల్లీ నుంచి ఎల్బీనగర్ వరకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తున్నందుకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి ఎంపీ ఈటలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఫోన్ పే ద్వారా లంచం!

**భద్రాచలం పోలీసుల ఘనత.. పట్టుకున్న ఏసీబీ**

**సీఐ, కానిస్టేబుల్‌తో పాటు మరొకరిపై కేసు**



**నేటి ప్రస్థానం, భద్రాచలం:** అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న లారీని పట్టుకొని.. దాన్ని విడుదల చేసినందుకు లంచం డిమాండ్ చేసి ఫోన్ పే ద్వారా రూ.20,000లు వసూలు చేసిన భద్రాచలం పోలీసులపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీఐ బి.రమేశ్, కానిస్టేబుల్ సీహెచ్.రామారావు, మరో వ్యక్తి కార్తీక్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వై.రమేశ్ విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. బూర్గంపాడు నుంచి భద్రాచలం వైపుగా మార్చి 19న మొరం తరలిస్తున్న ఒక వాహనాన్ని భద్రాచలం పోలీసులు అడ్డగించి స్టేషన్ తరలించారని తెలిపారు. ఈ వాహనంపై కేసు నమోదు చేయకుండా.. వెంటనే విడుదల చేయడానికి వాహనం యజమాని నుంచి కానిస్టేబుల్ రామారావు రూ.30వేలు డిమాండ్ చేయగా.. అంత డబ్బు ఇవ్వలేనని లారీ యజమాని చెప్పగా రూ.20,000లకు బేరం కుదుర్చుకున్నారు. రామారావు స్నేహితుడైన కార్తీక్‌ను భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే వాహన యజమాని నుంచి రూ.20,000లను ఫోన్ పే చేయించాడు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ఇన్‌స్పెక్టర్ బి.రమేశ్, కానిస్టేబుల్ సీహెచ్. రామారావు, ప్రైవేట్ వ్యక్తి డి.కార్తీక్‌ను విచారించి.. కానిస్టేబుల్ రామారావు సీఐ రమేశ్ ఆదేశాల మేరకే లారీ యజమాని నుంచి 20వేల రూపాయలు తీసుకున్నట్లు విచారణలో తెలిసిందని డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఆ ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు ప్రకటించారు.

## మార్కులు తక్కువ వచ్చాయని..

**నేటి ప్రస్థానం, హన్మకొండ:** మార్కులు తక్కువ వచ్చాయని వరంగల్ ఎన్ఐటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హన్మకొండ జిల్లా వడ్డేపల్లిలో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన హృతిక్‌సాయి వరంగల్ ఐన్ఐటీలో అక్కడే హాస్టల్‌లో ఉంటూ బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. అయితే పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తుండటంతో మనస్తాపం చెంది వడ్డేపల్లి చెరువుతో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## కంచ భూములు హెచ్‌సీయూకు

# బదిలీ కాలేదు..

**ఎంపవర్డ్ కమిటీని కలిసిన భువనగిరి, ఖమ్మం ఎంపీలు**



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో హైదరాబాద్ చేరుకున్నసుప్రీంకోర్టు ఎంపవర్డ్ కమిటీ మెంబర్ వినెయ్ లిమాయిను శుక్రవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు శ్రీ రఘురాం రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నం.25 కంచ గచ్చిబౌలి గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలోని భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి అని, రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెం.25లోని భూమి "కంచ అస్తబల్ పోరంబోకే సర్కారీ" అంటే ప్రభుత్వ భూమిగా నమోదైంది. 1975లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కి కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వేనం. 25, ఇతర సర్వే నంబర్‌లలో ఉన్న మొత్తం భూమిని స్వాధీనం చేశారు. అయితే అప్పుడు ఆ భూమి అన్యాక్రాంతమైందని.. యాజమాన్యం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అనుకూలంగా బదిలీ చేయలేదన్నారు. రెవెన్యూ రికార్డులు, అటవీ శాఖ ప్రకారం సర్వే నం.25లోని భూమిని "అటవీ"గా వర్గీకరించలేదని లిమాయికి ఎంపీలు కిరణ్ కుమార్ రెడ్డి రఘురాం రెడ్డి మెమోరండం సమర్పించారు




కిజికిస్తాన్‌లోని కిరాజ్ మెడికల్ అకాడమీలో జరుగుతున్న 2024 -25 పేరెంట్స్ మీట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ సీబీఐ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి సైదులు గౌడ్



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సీఎంఆర్ఎఫ్ చెక్కులను శ్రీరాముల అశోక్ రూ. 60.000, చింతల్ చెరువు, ధరావతు తరుణ్ రూ. 40500/- 5వ వార్డు వస్త్రం తండా బాధ్యులకు చెక్కులను అందజేసిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి**

# దేవుళ్లను కించపర్చేలా రవి, సుధీర్ స్కిట్

**హిందూ సంఘాల హెచ్చరికలు**



**నేటి ప్రస్థానం, హైదరాబాద్, ఏప్రిల్ 11 :** బుల్లితెర నటులు యాంకర్ రవి, సుడిగాలి సుధీర్ చేసిన స్కిట్ ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఓ టీవీ షో సందర్భంగా వారు చేసిన స్కిట్‌పై హిందూ సంఘాల ప్రతినిధులు భగ్గుమన్నారు. హిందూ దేవుళ్లను అపహాస్యం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. హిందువుల మనోభావాలను రవి, సుధీర్ దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూ సంఘం నేత కేవశరెడ్డి.. యాంకర్ రవికి ఫోన్ చేసిన మాట్లాడిన ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. దేవుడి పేరితో డ్రామాలు చేయడం తగదంటూ రవిని ఆయన హెచ్చరించారు. దేవుళ్లను కించపరుస్తూ స్కిట్‌లు చేయడం ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందంటూ మండిపడ్డారు. అయితే హిందూ దేవుళ్లను తామేక్కడా కించపరచలేదని యాంకర్ రవి తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సినిమాకు సంబంధించిన సీన్లనే తాము రిక్రియేట్ చేసినట్లు చెప్పారు.కొత్తగా తాము చేసిందేమీ లేదన్నారు. స్కిట్ సమయంలో అక్కడున్న వారంతా చెప్పులు, షూలు తీసి మరీ చిత్రీకరించామని యాంకర్ రవి చెప్పుకొచ్చారు. అయినా కేశవరెడ్డి మాత్రం మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దంటూ ఘాటుగా హెచ్చరించారు.

## విద్యాహక్కు చట్టం అమలుపై విచారణ



**నేటి ప్రస్థానం, హైదరాబాద్ :** విద్యాహక్కు చట్టం అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు- పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు-పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

**బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను**

# దిగ్విజయం చేయాలి

**వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్**



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** ఈనెల 27(ఆదివారం) బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం, రజతోత్సవ మహాసభల నేపథ్యంలో శుక్రవారం వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ముఖ్య నేతలతో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. వరంగల్ సభ నేపథ్యంలో పలువురు నేతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు మన డివిజన్ నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ గౌడ్, మధుగౌడ్, ఆనంద్ రాజ్, అజయ్, మల్లేశ్ గౌడ్,శ్రీనివాస్ యాదవ్,జైపాల్ రెడ్డి, కిషోర్ కుమార్, విజయ్, ఇల్యాస్ భాయ్, వాజ్జిద్ అలీ, రవి, రాజేష్ డివిజన్ బీఆర్ఎస్ నాయకురాలు లత, పద్మక్క, వెన్నెల, లత తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: కవిత



**నేటి ప్రస్థానం:** జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హైదరాబాదులోని కార్వాన్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొని కవిత ప్రసంగించారు. "ట్యాంక్‌బండ్ మీద జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్ స్థల పరిశీలన చేశారని తెలిసిందని, దానిని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. అలాగే పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో కూడా ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# గోదావరి-బనకచర్లపై ముందుకెళ్లకుండా చూడండి

**గోదావరి బోర్డుకు తెలంగాణ ఈఎన్సీ లేఖ**

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని కోరింది. ఈ నెల 7న జరిగిన సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించామని పేర్కొంది.. గోదావరి-బనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారు. కానీ, మ-రుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఆలస్యం చేయకుండా తక్షణమే ఏపీని నిలువరించాలని లేఖలో పేర్కొంది.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి



**నేటి ప్రస్థానం, వరంగల్:** అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి మహిళల విద్యకు బాటలు వేసిన మహనీయుడి మహాత్ముడు జ్యోతి రావు పూలే అని వక్తలు కొనియాడారు. పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం ములుగు రోడ్డు జంక్షన్ లోని జ్యోతి పూలే విగ్రహానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ కేఆర్ నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నతుడు పూలే అన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించేవారని వివరించారు. దేశంలోనే మొదటిసారి 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీలకు అండగా నిలిచారని కొనియాడారు. సత్యశోధక సమాజం తరపున ప్రారంభించిన 'దీనబంధు' వారపత్రికలో రెట్కతులు, కార్మికుల సమస్యలు, బాధలు రాసేవారని తెలిపారు. మొట్టమొదటగా దళిత బాలికలకు పాఠశాల నెలకొల్పారని.. ఆ తదనంతరం 1851లో మరో రెండు పాఠశాలల్ని, శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారని వివరించారు. పూలే కేవలం శూద్ర వర్ణాల్లో అణిచివేతకు గురౌతున్నకులాల ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారని శ్లాఘించారు. బ్రిటీష్ వలస వాదులకు '1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించిన ఘనత పూలేకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో KUDA చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, వరంగల్ , హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యా శారద దేవి, ప్రావిణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజి, అదనపు కలెక్టర్లు. అధికారులు, వివిధ అనుబంధ సంఘాల, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పూలేకు భారతరత్న ప్రకటించాలి: ఎంఎస్ఎఫ్



**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఓయూ అధ్యక్షుడు మంద రాజు మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగలు ముఖ్య అతిథులుగా పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాదిగ,కొమ్ము శేఖర్ మాదిగలు మాట్లాడుతూ... దేశంలోని సామాజిక అసమానతులపై పూలే దంపతుల కృషి చిరస్మరణీయమన్నారు. వారి త్యాగం దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలలో వెలుగులు నింపిందన్నారు. మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలేని తన గురువుగా ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడికి భారతరత్న ఇప్పటికీ ప్రకటించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయనకు తక్షణమే 'భారతరత్న' ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు వీరపాకుల పరశురాం మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగ, కొమ్ము సంజీవ్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడిపల్లి రఘువరణ్ మాదిగ, పాపగంటి నరేష్ మాదిగ,చింత డేనియల్ మాదిగ, బాబురావు ,ప్రణయ్ మాదిగ, వినయ్ మాదిగ, సూర్యవర్ధన్, దాసారపు సదానందం మాదిగ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# దార్శనికుడు జ్యోతిరావు పూలే..

- జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** విద్యను ఆయుధంగా చేసుకుని అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కొనియాడారు. శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్‌లో మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎల్బీనగర్ చౌరస్తా, హయత్‌నగర్ అంబేద్కర్ ధర్నాచౌక్ వద్ద జ్యోతిబాపూలే గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలను గుర్తు చేశారు. పూలే అడుగుజాడల్లో నడవాలని సూచించారు. మహనీయుల జయంతి, వర్ధంతిలను అన్ని వర్గాలు ఐక్యంగా జరుపుకోవాలన్నారు. కులం పరంగా సమాజాన్ని విభజించే వారితో జాగ్రత్తగా ఉండి ఆ మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మహనీయుల వేడుకల నిర్వాహకులు పారంద స్వామి, ఎర్ర రవీందర్, స్థానిక బీజేపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు పూలే ఆశయం ఆదర్శం: ప్రొఫెసర్ కోదండరామ్

**నేటి ప్రస్థానం:** అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి పూలే అని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ కొనియాడారు. విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని గ్రహించి, తన సతీమణికి విద్యాభ్యాసం కల్పించి మొట్టమొదటి మహిళా టీచర్‌గా నిలబెట్టి, సమాజానికి మార్గం చూపారని పేర్కొన్నారు. టీజేఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి కోదండరామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని, దాని అమలు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి భారతదేశంలో మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్టు చెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీలు ధర్నా చేస్తే ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి 2 గంటల పాటు ధర్నాలో కూర్చున్నారని గుర్తు చేశారు. కల్వకుంట్ల కవిత బీసీలను కించపరిచేలా తుపే ల్ ధర్నా అని అన్నారని మండపడ్డారు. బీసీల గురించి కవిత మాట్లాడటానికి ముందు జాగృతికి తొలుత బీసీని అధ్యక్షుడిని చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్లు అధికారంలో ఉండి బీసీ రిజర్వేషన్లను 32 శాతం నుంచి 18 శాతానికి



తగ్గించి బీసీలను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మండిపడ్డారు. ఇప్పుడు బీసీలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ దొంగే దొంగ అన్నట్టు ఉంది అని నిజ్జన రమేష్ అన్నారు. పూలే ఆశయ సాధన కోసం ప్రభుత్వం పని చేస్తున్నదని టీజేఎస పార్టీ తరుపున బీసీ ల అభ్యున్నతికి పాటు పడుతామని నిజ్జన రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గోపగాని శంకర్రావు, పల్లె వినయ్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, మహిళా జన సమితి నాయకురాలు పుష్పలీల, జన సమితి నాయకులు రమేష్, సురేష్, ఇస్మాయిల్, లక్ష్మణ్, మాణిక్యం, జహురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు..

## 2వేల కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్ :** గడచిన ఆర్థిక సంవత్సరంలో జిహెచ్ఎంసిలో 2వేలకోట్లు పన్ను వసూళ్లు జరిగాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 3వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని కమిషనర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో ప్రతి రూపాయికి న్యాయం చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల కోసమే ఆ ఆదాయాన్ని ఖర్చు చేస్తామని చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో గ్రేటర్‌లో రూ. 2వేల కోట్లకుపైగా ఆస్తి పన్ను వసూలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కమిషనర్.. ఆస్తి పన్ను విభాగంలోని అధికారులు, సిబ్బందిని సత్కరించారు.

## వరంగల్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

**నేటి ప్రస్థానం,వరంగల్:** మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి ఉత్సవాలు బీసీ సంక్షేమ భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి , ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ పాల్గొని మాట్లాడారు. 1848లోనే అంటరానితనంపై సమరశీల పోరాటం చేసి గొప్ప యోధుడు మహాత్మా జ్యోతిబాపూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి తుల రవి , బీసీ రాష్ట్ర కమిటీ నాయకులు జంపాల రవీందర్, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగపాణి, తెలంగాణ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు గొల్ల గట్టు సంజీవ, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చంటి భద్రయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఇరుగు పైడి మాదిగ, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు జన్ను రవి, సింగల్‌విండో చైర్మన్ చిక్కుడు రాములు, నంగారా భేరి నాయకుడు రాహుల్ నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నెమలి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ



### బీసీ సంక్షేమ సంఘం నాయకుడు నరేందర్ గౌడ్ హాజరు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. శుక్రవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ హైదర్‌గూడ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మేకపోతుల నరేందర్ గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ఈ విగ్రహాలను అందించిన ఆళ్ల రామకృష్ణ, రామన్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సామాజిక మార్పు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళల సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలేలు అహర్నిషలు శ్రమించారని కొనియాడారు. జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, సామాజిక వేత్త తోర్పునూరి క్రిష్టోఫర్ గౌడ్, నవీన్ రాజు, ఎర్ర శ్రీహరి గౌడ్, సరికొండ రామకృష్ణం రాజు, బీసీ సంక్షేమ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు శివకుమార్, గిరగాని భిక్షపతి గౌడ్, కలల్ నర్సింహులు గౌడ్, ఆనంతుల ప్రసాద్ గౌడ్, రవికుమార్ యాదవ్, ఉపేందర్, వినయ్ బాబు, అక్షిత్ జైస్వాల్, విశ్వపతి పాల్గొన్నారు.